స్ఫూర్తిప్రదాత జగ్జీవన్ రామ్

- మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- వర్ధంతి సందర్భంగా బాబూజీకి ఘన నివాళులు


ఉక్కు నగరం పార్కులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: భారతదేశం గర్వించదగ్గ నాయకుడు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. యువతకు ఆయన స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని బాబూ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంట్యాడ గురుమూర్తి అధ్యక్షతన పెదగంట్యాడ కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, నాయకులు మార్టుపూడి పరదేశి, ఘాటూరి శ్రీనివాసరావు, గంట్యాడ గోవిందరాజు, ములకలపల్లి ఈశ్వరరావు, కాకినాడ పెంటారావు, అనపర్తి వెంకటరమణ, ములకలపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు స్టీల్‌ప్లాంట్‌లో ఘన నివాళి అర్పించారు. ఉక్కు దళిత సంఘాల ఆధ్వర్యంలో సెక్టార్–5 జగ్జీవన్‌రామ్ పార్కులో జరిగిన కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు మాటూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ 8 సార్లు ఎంపీగా, 40 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా పని చేసి ఆయా శాఖలకు వన్నె తెచ్చిన నేత బాబూ జగ్జీవన్ రామ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ సేవలను నాయకులు వై.మస్తానప్ప, రామ్మోహన్‌కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో డి.సంపూర్ణం, కె.సుబ్బారావు, బి.ఎ.స్వామి, కె.రాజబాబు, దరిగి రవి, నతాన్యియల్, డి.మోహన్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో..

అక్కిరెడ్డిపాలెం: జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా భెల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాబూజీ విగ్రహానికి భెల్ ఈడీ ఎస్.జితేంద్ర రెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏజీఎం (హెచ్ఆర్) ఎస్.లీల, జీఎంలు ఎం.ఎన్.శ్రీనివాసరావు, పట్నాయక్, జి.చంద్రశేఖర్, యూనియన్ల ప్రతినిధులు పి.వి.ఎన్.రాజు, ఎస్.సాహు, జి.టి.పి.ప్రకాష్, సీహెచ్.మురళీశ్వరరావు, హెచ్.భోగేష్, బి.రాజ్‌కుమార్, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.


భెల్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈడీ జితేంద్ర రెడ్డి

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న భూపతిరాజు సుజాత

గాజువాక: జీవీఎంసీ 73వ వార్డు సింహగిరి కాలనీ జంగాల వీధిలో రూ.19.90 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ భూపతిరాజు సుజాత శనివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. వార్డులోని వివిధ కాలనీల్లో పలు అభివృద్ధి పనులు సాగుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ముగిసిన ధ్యాన యజ్ఞం


మాట్లాడుతున్న శివ గణేశ్వరరావు

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యారాడలోని రామాలయంలో 41 రోజుల పాటు నిర్వహించిన ధ్యాన యజ్ఞం శనివారం ఘనంగా ముగిసింది. ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు మాట్లాడుతూ యారాడ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 8 నుంచి పీఎస్సార్ కాలనీలోని యువజన సేవా సంఘం భవనంలో 41 రోజుల పాటు ధ్యాన యజ్ఞం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వర్మ రాజు, వంక అప్పారావు, బాయన శివ, నాగోతి రమణ, గుజ్జారి నాని తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ


చీరలను పంపిణీ చేస్తున్న జీవీఎల్ నర్సింహారావు

గాజువాక: గాజువాకలో పేద మహిళలకు బీజేపీ నాయకులు చీరలు, నిత్యావసర సరకులు, పళ్లు పంపిణీ చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు జీవీఎల్ నర్సింహారావు జన్మదినం సందర్భంగా గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని నర్సింహారావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, గూటూరు శంకరరావు, బాటా శ్రీను, కట్టా పద్మ, లక్కరాజు సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి


ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎల్ తదితరులు

గాజువాక: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి గాజువాక బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా పంతులుగారి మేడవద్ద బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు, ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే శాశ్వత పరిష్కారం


మాట్లాడుతున్న రామారావు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు శాశ్వత పరిష్కారం సెయిల్‌లో విలీనమేనని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు అన్నారు. ఆ దిశగా అందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1241వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2030 నాటికి 3వందల మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి విశాఖ ఉక్కును ఆదుకునే ప్రయత్నం చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని, విఘాతాలు తొలగించాలని, మైన్స్‌కు అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో సీఎంఎం, సీఎంఈ, సీఆర్ఎంపీ, లూబ్రికేషన్ అండ్ హైడ్రాలిక్ విభాగాల ప్రతినిధులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, డీసీహెచ్.వెంకటేశ్వరరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, శ్రీనివాస నాయుడు, సంజీవరావు, ఎస్.ఎస్.అప్పారావు, చిన్నంనాయుడు, వాసు మాట్లాడారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములవుదాం


ప్రసంగిస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: ఇళ్లలో ఉత్పన్నమయ్యే తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించాలని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు కోరారు. వార్డులోని డ్రైవర్స్ కాలనీ రామాలయం వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెత్తను రోడ్డుపై వేయకుండా ప్రజారోగ్య విభాగం సిబ్బందికి అందించడం ద్వారా భూ సమతుల్యతను కాపాడినవారవుతారన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వీధులు, కాలువలు పరిశుభ్రంగా ఉండే విధంగా శానిటేషన్‌ను నిర్వహించాలని ప్రజారోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వన మహోత్సవం


మొక్క నాటుతున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శనివారం వన మహోత్సవ్-2024 ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు తల్లి పేరు మీద ఒక మొక్క నినాదంతో ఉక్కు టౌన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ మొదటి నుంచి ఇప్పటి వరకు విస్తృతంగా 55.38 లక్షల మొక్కల చెట్ల పెంపకం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో గణనీయమైన కృషి చేసిందన్నారు. ఈ నెల మొదటి వారంలో 2 వేల టేకు మొక్కలు నాటడానికి ప్రణాళిక చేయడం అభినందనీయమన్నారు. స్టీల్ ప్లాంట్ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంలో ఆగ్రోఫారెస్ట్ సిబ్బంది కృషి ప్రశంసనీయమన్నారు. సీజీఎం జి.గాంధీ, టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగం జీఎం ఆర్.పి.శర్మ, ఆగ్రోఫారెస్ట్ విభాగాధిపతి వి.ఎల్.పి.లాల్, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొని మొక్కలు నాటారు.

సృజనాత్మకత ప్రదర్శనకు చిత్రకళ దోహదం


బహుమతులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

గాజువాక: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి చిత్రకళ దోహదం చేస్తుందని సరస్వతి విద్యా విహార్ చైర్మన్ సంజీవ్ అన్నారు. పాఠశాలలో ఉచిత చిత్రకళా శిబిరం-2024 ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే ఇతర రంగాలపై పిల్లలు ఆసక్తి చూపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. విశాఖ కళా పరిషత్ అధ్యక్షుడు జి.వి.కె.అప్పలరాజు మాట్లాడుతూ 1995లో తమ సంస్థ ఏర్పడిన నాటి నుంచి ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఈ శిబిరంలో 20 పాఠశాలల నుంచి 220 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. చిత్రకళ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ చెల్లూరి భాస్కరరావు, కేఎల్ఎం షాపింగ్ మాల్ మేనేజర్ కె.బాబ్జీ, ప్రతినిధి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో చిన్నారుల సందడి


చిన్నారుల నృత్య ప్రదర్శన

గాజువాక: పాతగాజువాకలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో చిన్నారులు సందడి చేశారు. ఫ్రెషర్స్ విత్ ఫాదర్స్ పేరిట శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టార్ కిడ్స్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు చిట్టిపొట్టి మాటలు, పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, రీజినల్ ఇన్‌చార్జి రమణ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జిలు జ్యోత్స్న, మీనాక్షి, మౌనిక, ఏవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

53వ సారి రక్తదానం

ఉక్కు అధికారి సేవాతత్పరత


రక్తదానం చేస్తున్న శ్రీనివాస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం డీజీఎం కర్రి శ్రీనివాస్ శనివారం 53వ సారి రక్తదానం చేశారు. ఇండియన్ నేవీ ఉద్యోగి నరసింగరావు భార్య ఆశ గర్భవతి. డెలివరీ నిమిత్తం ఆమె మల్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా, అరుదైన ఓ నెగెటివ్ రక్తం అవసరమైంది. సమాచారం అందుకున్న శ్రీనివాస్ వెంటనే ఆస్పతికి వెళ్లి రోగికి రక్తదానం చేశారు. రోగికు సకాలంలో రక్తం అందడంతో వారి బంధువులు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లలితాపీఠంలో వారాహి నవరాత్రులు ప్రారంభం


వారాహి దేవి

సీతంపేట: లలితా నగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం వారాహిదేవికి సహస్ర నామార్చన చేశారు. అమ్మవారిని అలంకరించి దూప దీప నైవేద్యం సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహిదేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. ఈ నెల 10న శుద్ధ పంచమి సందర్భంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు

గాజువాక: ప్రతి ఒక్కరూ బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని విశ్రాంత నావికాదళ కమాండర్ పాకల సుగుణాకర్ అన్నారు. స్థానిక ఓక్‌వ్యాలీ స్కూల్‌లో నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు తమ శాఖలకు సంబంధించిన బ్యాడ్జిలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ నాయకులుగా ఎదగాలన్నారు. పాఠశాల చైర్మన్ ఎ.బాలరెడ్డి మాట్లాడుతూ ప్రజా నాయకులను ప్రజలు ఎన్నుకున్నట్టే విద్యార్థులు తమ నాయకులను ఎన్నుకున్నారన్నారు. ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో ఈ ఎన్నికల ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో అన్నపురెడ్డి విద్యా సంస్థల అధిపతి ఎ.ప్రాన్సినారెడ్డి, డైరెక్టర్ ఎ.ప్రణయ్‌దీప్ రెడ్డి, డీన్ ఫిలోమినా, ప్రిన్సిపాల్ ఐ.కోమలిదేవి, వైస్ ప్రిన్సిపాల్ అనితాలోబో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి పాద ప్రతిష్ట


స్వామి వారి పాదాలను ప్రతిష్ఠిస్తున్న శ్రీనివాసానంద స్వామిజీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి పాద ప్రతిష్టను శనివారం ఘనంగా నిర్వహించారు. కొవిరి సత్యారావు, జానకి దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీవారి పాదాలను శ్రీనివాసానంద స్వామిజీ ప్రతిష్ఠించారు. స్వామీజీ మాట్లాడుతూ ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించి, నిత్యం పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా స్వామికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, అప్పలరెడ్డి, శైలజ, ధనుజ, హనుమంతు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు


శునకాలకు టీకా వేస్తున్న నెల్లిముక్కు వెటర్నరీ ఆస్పత్రి వైద్యాధికారి విజయకుమార్ పాణిగ్రహి


నడుపూరు వెటర్నరీ ఆస్పత్రి వద్ద కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ పద్మలీల


అగనంపూడి పశువైద్యశాలలో కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ లావణ్య

పెదగంట్యాడ: నడుపూరు, నెల్లిముక్కు వెటర్నరీ ఆస్పత్రుల ఆవరణలో శనివారం పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య శాఖ యాంటీ ర్యాబిస్ టీకాలను ఉచితంగా అందించే ఏర్పాట్లు చేసింది. దీంతో జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించేందుకు వెటర్నరీ ఆస్పత్రిలకు తీసుకొచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ విజయకుమార్ పాణిగ్రహి, డాక్టర్ ఎం.పద్మలీల మాట్లాడుతూ పెంపుడు జంతువులు కరవడం వల్ల మనుషులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నెల రోజులపాటు టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. ఇప్పటికి నడుపూరు వెటర్నరీ ఆస్పత్రిలో 155, నెల్లిముక్కు వెటర్నరీ ఆస్పత్రిలో 100 టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి పశు వైద్యశాలలో..

అగనంపూడి: అగనంపూడి పశువైద్యశాల ఆధ్వర్యంలో 82 పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈసందర్భంగా పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పువ్వుల లావణ్య మాట్లాడుతూ పెంపుడు జంతువులకు వ్యాధులు సంక్రమించకుండా ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఇందిరా రాణి, బి.శ్రీనివాసరావు, ఎస్.సన్యాసిరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ హేమలత సూచించారు. ధైర్య హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా భవిత కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి జ్వరాలతో పాటు డయేరియా కూడా ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం భవిత కేంద్రంలో మొక్కలు నాటారు. ఏపీ వికలాంగుల నెట్ కన్వీనర్ జీలకర్ర రమణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భవిత కేంద్రంలోని చిన్నారులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రమణాజీ, జీలకర్ర భువనేశ్వరి, భవిత కేంద్రం నిర్వాహకులు సూర్యనారాయణ, జయభారతి పాల్గొన్నారు.

పని ప్రదేశ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న హెచ్ఎం ప్రమీలారాణి, బృంద సభ్యులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన పని ప్రదేశ నిర్వహణ (ఫైవ్ ఎస్) బృందం సభ్యులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఫైవ్ ఎస్‌పై అవగాహన కల్పించారు. ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులకు శనివారం దీనిపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పని ప్రదేశం, ఇళ్ల ప్రాంతాల్లో వ్యర్థాల తొలగింపు, ఉన్న వస్తువులను సక్రమంగా అమర్చుకోవడం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కాలుష్యం, దుష్ప్రభావాలు, వాటి వినియోగం తగ్గించడం అంశంపై డిబేట్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.ప్రమీల, ఫైవ్ ఎస్ బృంద సభ్యులు సీహెచ్.శ్రీనివాసశాస్త్రి, ఎస్.సతీష్‌కుమార్, వై.కిషోర్ కుమార్, వి.వి.ఎస్.ఆర్.మూర్తి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు విజయనగరం, హనీ గ్రూప్

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా క్రికెట్ సంఘం వార్షిక డివిజన్ లీగ్ పోటీల్లో విజయనగరం, గెలాక్సీ జట్లతోపాటు డివిజన్ల, ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేతలు ట్రోఫీలందుకున్నారు. శనివారం నిర్వహించిన వార్షిక బహుమతి ప్రధానోత్సవంలో తొలి డివిజన్ విజేతగా విజయనగరం జిల్లా జట్టు నిలవగా, రన్నరప్‌గా గెలాక్సీ సీసీ నిలిచింది. రెండో డివిజన్‌లో ఈకోర్సా, కౌంటీ సీసీ జట్లు, మూడో డివిజన్‌లో స్టీల్‌ప్లాంట్, సోలోస్ జట్లు, నాలుగో డివిజన్‌లో ఉషోదయ సీసీ, మూన్ స్టార్స్ జట్లు, ఐదో డివిజన్‌లో రైజింగ్ బ్లూస్, యూసీసీ జట్లు, ఆరో డివిజన్‌లో వాల్తేర్ నైట్స్, లెజండ్స్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇన్‌స్టిట్యూషన్ లీగ్‌లో హనీ గ్రూప్, సిటీ పోలీస్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. స్థాయి ఆధారంగా ఆరు డివిజన్లుగా పోటీలు నిర్వహించగా తొలి డివిజన్‌లో తపస్వి బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా, మనీష్ బెస్ట్ బౌలర్‌గా, ఎస్వీ రాహుల్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచారు. ఈశ్వర్, చరణ్, సుమీత్ రెండో డివిజన్‌లో, యశస్వి, శ్రీనివాస్, సతీష్ మూడో డివిజన్‌లో, రాజు, నాగార్జున, అనిల్‌కుమార్ నాలుగో డివిజన్‌లో బెస్ట్‌గా నిలిచారు. సతీష్, హరీష్, హేమంత్ ఇన్‌స్టిట్యూషనల్ లీగ్‌లో బెస్ట్‌గా నిలిచారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, కార్యదర్శి పార్థసారధి బహుమతి ప్రధానం చేయగా సంఘం ప్రతినిధులు సుధాకర్, టీఎస్ఆర్ ప్రసాద్, ఎస్ఎస్ ప్రసాద్, జేకేఎం రాజు, సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.